క్లుప్తంగా

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: మన స్నేహం ఎన్ఎస్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని అంకజాంపల్లెలో నిరుపేద మహిళలకు గురువారం చీరలు పంపిణీ చేశారు. దాతలు అశోక్‌గుప్తా, న్యాయవాది లక్ష్మిల సహకారంతో చీరలు పంపిణీ చేసినందుకు మనస్నేహం సంస్థ అధ్యక్షుడు కావేరి ధర్మేందర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. సాయం చేయాలనే మంచి మనస్సు ఉన్న వారికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. బుజ్జి, జ్యోతి, సోని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన సైదులు

కొమరోలు: ఓ లారీ.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. బేస్తవారపేట నుంచి గిద్దలూరు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని తాటిచెర్లమోటు గ్రామ సమీపంలో లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో సైదులు అనే ద్విచక్ర వాహనదారునికి తీవ్రగాయాలు కావడంతో 108లో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

నేడు కౌన్సిల్ సమావేశం

గిద్దలూరు రూరల్: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ వై.రామకృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు



మార్కాపురం టౌన్: ప్రార్థనకు వెళ్తున్న ముస్లింలు



బేస్తవారిపేట: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పెద ఉల్లగల్లు లో ఈద్గా వద్ద ప్రార్థనలు



మల్కాపురంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మార్కాపురం టౌన్: పట్టణంలోని ముస్లింలు బక్రీద్ పండను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అల్లాహ్ మహిమను తెలిపే పవిత్రమైన ఈదుల్ అజహ్ బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు. పజల్ నమాజ్ అనంతరం నూతన దుస్తులు ధరించి గృహాల్లో నమాజ్ చేసుకున్నారు. పెద్ద మసీదులో జరిగిన ప్రార్థనల్లో మత పెద్ద షేక్ హాఫీజ్ మాట్లాడుతూ ప్రవక్త ఆయన తనయుడు ఇస్మాయిల్ ప్రవక్తల త్యాగ నిరతిని ప్రతి ఒక్క ముస్లిం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదుల్లో (ఈదుల్ మోమినిన్) పురస్కరించుకుని ప్రత్యేక నమాజ్‌లు చేశారు.

పొదిలి: స్థానిక ఈద్గా మైదానంలో గురువారం ముస్లింలు బక్రీద్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ పర్వదిన ప్రత్యేకత గురించి మత పెద్దలు చెప్పారు. వర్షాలు సక్రమంగా కురిసి పాడి పంటలతో అందరూ శాంతియుత జీవనం సాగించాలని కోరుకున్నారు. సీఐ రాఘవేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్ఐలు మల్లికార్జున, దీపిక, సుధాకర్ పాల్గొన్నారు.

ముండ్లమూరు (తాళ్లూరు): మండలంలోని మల్కాపురం, తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం, బొద్దికూరపాడు, రమణాలవారిపాలెంలో గురువారం ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మత పెద్దలు ఖురాన్ ప్రాధాన్యతను ముస్లిం సోదరులకు వినిపించారు. మల్కాపురం సర్పంచ్ వలి, కోఆప్షన్ సభ్యులు కరిముల్లా, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి సయ్యద్ లతీఫ్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండలంలోని పెద ఉల్లగల్లు, వేముల, ఉమామహేశ్వరపురం, ముండ్లమూరు, పులిపాడు, ఈదర, శంకరపురంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లి, హిందూ సోదరులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

దొనకొండ: ముస్లింలు గురువారం ఘనంగా బక్రీద్ జరుపుకున్నారు. మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం బీదలకు దాన ధర్మాలు చేశారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, మండల కన్వీనర్ కాకర్ల క్రిష్టారెడ్డి, మాజీ కన్వీనర్ కందుల నారపురెడ్డి, జెడ్పీటీసీ మురికిపూడి సుధాకర్, జిల్లా యూత్ అధ్యక్షులు గొంగటి శ్రీకాంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

దర్శి: మండలంలో బక్రీదు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈద్గా మైదానానికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దాన ధర్మాలు చేశారు.

త్రిపురాంతకం: ముస్లింలు బక్రీద్ పండగను ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్రిపురాంతకంతో పాటు మేడపి, గణపవరం, ఎండూరివారిపాలెం, వెల్లంపల్లి, గొల్లపల్లి, దూపాడు, ముడివేములలో బక్రీద్ పండగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు పండగ విశిష్టత వివరించి చిన్నారులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కంభం: బక్రీద్ పండగను గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి తమ ఇళ్ల నుంచి ర్యాలీగా ఈద్గా మైదానం వరకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈద్గా మైదానానికి వెళ్లని వారి కోసం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా మైదానం వద్ద ముస్లి యువకులు ప్రార్థనలకు వచ్చిన వారి కోసం మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఈద్గా మైదానం వద్ద ఎస్ఐ నాగమల్లేశ్వర రావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బేస్తవారిపేట: మండలంలోని ముస్లింలు సహనం, త్యాగం, పరోపకారానికి నిలువెత్తు రూపమైన బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని కొత్తపేట, గలిజేరుగుళ్ల, చింతలపాలెం, బేస్తవారిపేట గ్రామాల్లోని ఈద్గల వద్ద బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హిందూ, ముస్లిం సోదరులు ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం సోదరులు విరివిరిగా దానధర్మాలు చేశారు.

పెద్దదోర్నాల: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండగ సందర్భంగా గురువారం ఈద్గాల వద్దకు అల్లాహ్ అక్బర్ అంటూ తరలి వెళ్లారు. మౌలానాలు ఈద్ నమాజ్ చదివి పుణ్యవచనాలు పలికారు. ఈ పవిత్ర దినాన్ని త్యాగానికి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద కులమతాలకు అతీతంగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కొనకనమిట్ల: బక్రీద్ పండగను గురువారం ముస్లింలు నిరాడంబరంగా జరుపుకున్నారు. కొనకనమిట్ల, గొట్లగట్టు, నాయుడుపేట, నాగంపల్లి, బచ్చలకూరపాడు, గార్లదిన్నె మసీదుల్లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముస్లింలు చేరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



దొనకొండలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

గిద్దలూరు రూరల్: బక్రీద్ పండగ సందర్భంగా మండలంలోని ముస్లింలు గురువారం ఈద్గాల వద్ద పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని నంద్యాల రోడ్డు ఈద్గా వద్ద, కొంగలవీడురోడ్డు ఈద్గా వద్ద ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దతు పవిత్ర ఖురాన్ గ్రంథంలోని విషయాలు వివరించారు.

దర్శి: మండలంలో బక్రీదు పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ఈద్గా మైదానానికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దాన ధర్మాలు చేశారు.

అన్ని మండలాలకు జేసీఎస్ కన్వీనర్ల నియామకం

మార్కాపురం: జగనన్న సచివాలయల కన్వీనర్లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా మార్కాపురం మున్సిపల్ జేసీఎస్ కన్వీనర్‌గా పత్తి వెంకట రవిచంద్ర, మార్కాపురం రూరల్ కన్వీనర్‌గా పొందుగుల శ్రీనివాసరెడ్డి, కొనకనమిట్ల కన్వీనర్‌గా ఎస్. వెంకటరెడ్డి, పొదిలి కన్వీనర్‌గా గొలమారి చెన్నారెడ్డి, తర్లుపాడు కన్వీనర్‌గా కె.రామాంజనేయరెడ్డిలను నియమిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నగర పంచాయతీ జేసీఎస్ కన్వీనర్‌గా కావేటి ఈశ్వర్‌నాయుడు, గిద్దలూరు మండల కన్వీనర్‌గా బత్తెం ఓబుల్‌రావు, అర్ధవీడుకు ఏరువ కృష్ణారెడ్డి, బేస్తవారిపేటకు తోటపల్లి వెంకట శేషఫణిశర్మ, కంభానికి షేక్ మున్నా, కొమరోలుకు వీరంరెడ్డి మోహన్‌రెడ్డి, రాచర్లకు బెల్లం నాగిరెడ్డిలను నియమించారు.

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం మండల కన్వీనర్‌గా సయ్యద్ జబీవుల్లా, పుల్లలచెరువు కన్వీనర్‌గా దొమకాళ్ల వెంకటేశ్వర్లు, త్రిపురాంతకం కన్వీనర్‌గా చల్లా చిన్న ఎల్లారెడ్డి, పెద్దారవీడు మండల కన్వీనర్‌గా యేరువ వెంకటేశ్వరరెడ్డి, పెద్దదోర్నాల మండల కన్వీనర్‌గా గుండారెడ్డి రమణారెడ్డి నియమితులయ్యారు.

దర్శి: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దర్శి నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. దర్శి ఇన్‌చార్జిగా బత్తినేని వెంకటేశ్వర్లు, దర్శి నగరానికి ఎదురు కోటిరెడ్డి, దొనకొండ మండలానికి గుంటు పోలయ్య, కురిచేడుకు మేరువ సుబ్బారెడ్డి, ముండ్లమూరుకు మేడికొండ జయంతి, తాళ్లూరు మండల జేసీఎస్ ఇన్‌చార్జ్‌గా యాడిక శ్రీనివాసరెడ్డిలను నియమించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

త్రిపురాంతకం: మండలంలోని దూపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం సాయంత్రం జరుగుతుందని ఎంపీడీఓ సాంబశివరావు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని చెప్పారు. గ్రామ సచివాలయం, ఆర్‌బీకే నూతన భవనం ప్రారంభించనున్నారు. అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

గిద్దలూరు ఎస్ఐగా మహేష్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ఎస్ఐగా వి.మహేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాచర్లలో ఎస్ఐగా పనిచేస్తున్న మహేష్‌ను పోలీసు ఉన్నతాధికారులు గిద్దలూరుకు బదిలీ చేశారు. గిద్దలూరులో పనిచేస్తున్న బ్రహ్మనాయుడును ఒంగోలు సీఎస్‌కు బదిలీ చేశారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

చీరాల రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎరుకల సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక రామ్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏకలవ్య జయంతి వేడుకలను తుమ్మ శ్రీను, బచ్చు భారత్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాలపర్తి శ్రీనివాసరావు, ఇతర ప్రతినిధులు ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏకలవ్యుడు గురువు లేకుండా ఒంటరిగా ఎంతో జ్ఞానాన్ని సంపాదించారని, ఆయన మాదిరిగా అందరం జ్ఞానంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మొగిలి దీపిక, దాసరి శ్రీకాంత్, గ్రామ పెద్దలు రామేశ్వర కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



బేస్తవారిపేట: ప్రత్యేక అలంకరణలో మణికంఠుడు



కొనకనమిట్ల: వెలుగొండలో..



మార్కాపురం: ప్రసన్న వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కురిచేడు: అభిషేకాలు చేయిస్తున్న భక్తులు



తర్లుపాడులో..



పెద ఉల్లగల్లు వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



త్రిపురాంతకంలో పూజలు చేస్తున్న భక్తులు

మార్కాపురం: తొలి ఏకాదశి పర్వదినాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, కంభం రోడ్డులోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం, సత్యనారాయణస్వామి, గుండ్లకమ్మ సమీపంలోని శ్రీదేవీ భూదేవీ సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి, జవహర్‌నగర్ కాలనీలోని అమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచే ఆలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. పండగల్లో మొదటి పండగ కావటంతో భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాలకు వెళ్లారు. తీర్థప్రసాదాలు అందించారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అధ్యక్ష, కార్యదర్శులు రావిపాటి రామారావు, నిట్టూరి వెంకట రమేష్‌లు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

త్రిపురాంతకం: తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి, శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. త్రిపురాంతకం ఆలయాల్లో తొలి ఏకాదశి పండగ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో కుంకుమార్చనలు, త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఆలయంలో అభిషేకాలు అర్చకులు ప్రసాదశర్మ, విశ్వనారాయణశాస్త్రి నిర్వహించారు. భక్తులకు పండితులు ఆశీర్వచనం అందించి ప్రసాదాలు అందజేశారు.

కురిచేడు: హిందువులకు తొలి పర్వదినమైన తొలి ఏకాదశిని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వేకువజాము నుంచి భక్తులు శైవాలయాలు, వైష్ణవాలయాల్లో బారులు తీరి ప్రత్యేక పూజలు చేయించారు. స్థానిక శ్రీ జ్ఞాన ప్రసూనాంబాసమేత శ్రీ కాళహస్తీశ్వర ఆలయంలో ప్రత్యేక అభిషేకాలను ఆలయ పూజారులు కురిచేటి సుబ్బరాయ శర్మ, ఎర్రశేషయ్య, పెద్ద శేషయ్య చేశారు.

బేస్తవారిపేట: మండలంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని హిందువులు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బేస్తవారిపేటలోని శ్రీరాములవారి ఆలయం, శివాలయం, పోలేరమ్మ, దర్గా కొండపై త్రిలోక పుణ్యక్షేత్రం, గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రాములవారి ఆలయంలో విష్ణుమూర్తికి విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. గోమాతను పూజించారు. ప్రత్యేకంగా తయారు చేసిన పేలాల పిండిని ప్రసాదంగా పంచి పెట్టారు.

కొనకనమిట్ల: తొలి ఏకాదశి పండగను గురువారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభంలో వచ్చే మొదటి పండగ కావడంతో అన్నీ వర్గాలకు చెందిన వారు ఆలయాల్లో పూజలు చేశారు. స్వామి దర్శనం చేసుకొని భక్తితో పరవశించారు. మహిళలు ఉదయాన్నే ఇంటి ముంగిట రంగవల్లికలు అలంకరించారు. తమ ఇష్ట దైవాలకు పూజలు చేశారు. వెలుగొండ పుణ్యక్షేత్రం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, కొనకనమిట్ల రామదూత క్షేత్రం, ఎదురాళ్లపాడు సంగమేశ్వర ఆలయం, గొట్లగట్టు గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయం, రామాలయం, పెదారికట్ల శివాలయంలలో భక్తులు గోమాతలను పూజించి విశేష పూజలు చేశారు.

ముండ్లమూరు: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలను సందర్శించి స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఉల్లగల్లులోని పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం, ముండ్లమూరులోని శ్రీమల్లమాంబసమేత మల్లికార్జున ఆలయం, మారెళ్లలోని హరిహర దత్తక్షేత్రంలో అభిషేకాలు నిర్వహించారు. నరసింహమూర్తి, నగేష్‌శర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని వెల్లుపల్లె సమీపంలో ఉన్న రామకృష్ణ ధ్యాన మందిరం ఆవరణలో తొలి ఏకాదశి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని రామకృష్ణ ధ్యాన మందిరం, షరాబ్ బజారులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, రాచర్ల రోడ్డు వేంకటేశ్వర ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయంలోనూ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

తర్లుపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం హిందువులు తొలి ఏకాదశి పండగను, ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రం తర్లుపాడులోని వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం పూజలు చేసేందుకు ఉదయం నుంచే భక్తులు బారులుతీరారు. స్వామి వారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తర, సహస్త్ర నామార్చన, అభిషేక పూజలు చేశారు. తర్లుపాడుతో పాటు తుమ్మలచెరువు, కలుజువ్వలపాడు, మీర్జపేట తదితర గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 9 గంటలకు సమీపంలోని మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఏకలవ్యుడు మహావీరుడు



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ

దర్శి: ఏకలవ్యుడు మహావీరుడు పరాక్రమ వంతుడని ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏకలవ్యుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. నిరు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గురువుకు ఇచ్చిన వాగ్దానం మేరకు తన బొటన వేలుని సైతం గురుదక్షిణగా ఇచ్చిన చరిత్ర ఏకలవ్యుడిదని కొనియాడారు. సంఘసేవకులు జీవీ రత్నం, ఎస్టీ సంఘం జిల్లా అధ్యక్షులు రత్నం, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, పుట్ట రవి, జి. ప్రేమ్‌కుమార్, మార్క్, బొమ్మిరెడ్డి లక్ష్మీ రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన జగనన్న సురక్షతో ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 1 నుంచి 30వ తేదీ వరకు జగనన్న సురక్ష పథకంలో భాగంగా అధికార యంత్రాంగం మొత్తం ప్రజల వద్దకు చేరుకుంటుందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. మొత్తం 11 రకాల సర్టిఫికెట్లను జగనన్న సురక్షలో పొందుపరిచారన్నారు. ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటి వద్దకే అధికార యంత్రాంగం చేరుకుని సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. గడప గడప కార్యక్రమం ద్వారా సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి కోసం రూ.20 లక్షల నిధులు కేటాయించిందన్నారు. అధికారులు అలసత్వం వీడి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం పథకాలు ప్రజలందరికీ అందుబాటులోకి తీసకొచ్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలూ కృషి చేస్తున్నారని కొనియాడారు. పార్టీ అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలు మానుకోవాలని ఎమ్మెల్యే అన్నా సూచించారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కోటా నరసింహులు, జెడ్పీటీసీ బుడతా మధుసూదన్ రావు, వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ భూమా నరసింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఈశ్వర్‌నాయుడు, ముద్దర్ల శ్రీను, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన కేంద్ర బృందం



కందకాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టులో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు చేసిన ఖండిత కందకాలను సెంట్రల్ నోడల్ అధికారి, సాకేంతిక అధికారి పి.యాదయ్య, డ్వామా పీడీ కె.శీనారెడ్డిలు గురువారం పరిశీలించారు. రోజుకు ఎంత మేరకు పని చేస్తున్నారని, సిబ్బంది పనులు కల్పిస్తున్నారా లేదా అని తదితర వివరాలు కూలీలను కేంద్ర బృందం అడిగి తెలుసుకుంది. కేంద్ర బృందం మాట్లాడుతూ పని ఎంత చేసుకుంటే అంత డబ్బులు వస్తాయని తెలిసింది. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధీ హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. పెద్దారవీడు ఎంపీడీఓ కార్యాలయ అవరణంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన రూఫ్ వాటర్ స్ట్రక్చర్‌ను పరిశీలించిన అనంతరం మొక్కలు నాటారు. ఎంపీడీఓ ఎం. నాసరరెడ్డి, ఏపీడీ భాస్కరరావు, ఏపీఓ సాంబశివయ్య, క్షత్ర సహాయకుల సంఘ మండల అధ్యక్షుడు ఒద్దుల లక్ష్మీరెడ్డి, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

వైభవంగా బెల్లం స్థానం తిరునాళ్ల



అలంకరణలో శివలింగం

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువు పంచాయతీ పరిధి పోచమక్కపల్లి రెవిన్యూలోని బెల్ల స్థానం కొండపై తిరునాళ్ళ గురువారం భక్తులు వైభవంగా నిరహించారు. చుట్టు పక్కల గ్రామాలు ఇండ్లచెరువు, భూమనపల్లి, పిచ్చిగుంట్లపల్లి, పడమరపల్లి, గజ్జలకొండ, మాలపాటిపల్లి, కలివెలపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కొండపై వెలసిన శివపార్వతి, ఆంజనేయస్వాములను పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ప్రతి ఏడాది తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు బెల్ల స్థానం కొండపై తిరనాళ్ళ జరుపుకుంటారు. ఆడపడుచులు వారి మొక్కులు చెల్లించుకుంటారు. తిరునాళ్ళకు వచ్చిన భక్తులకు దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.